ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
మంగళవారం 26 మార్చి 2024







గడప గడపకూ నీరేదీ?

- జగన్ సర్కారు నిర్లక్ష్యం.. కడప వాసులకు శాపం
- నీటి కోసం నానా అగచాట్లు
- ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి
- ఎండిపోయిన పెన్నా
- నీటి ఎద్దడి తలెత్తకుండా కార్పొరేషన్ అధికారుల ఆరాటం
- మైలవరం నీటి కోసం పదిరోజులుగా అధికారుల భగీరథయత్నం
- చంద్రబాబుపై కక్షతో లింగంపల్లె సబ్ సర్ఫేజ్ చెక్‌డ్యాం పనులు రద్దు
- ఎన్నికలకు ఆరునెలల ముందు.. బ్రహ్మంసాగర్ నీళ్లంటూ తెరపైకి
- కడపలో మొదలైన నీటి కష్టాలు

అంగట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అంటే కడప వాసులదేనేమో. ఎందుకంటే పక్కనే పెన్నానది ఉంది. అయినా నీటి కోసం చింతే. వేసవి వచ్చిందంటే చాలు జనం గుండెల్లో నీటి కోసం భయం మొదలవుతుంది. సొంత జిల్లావాసి జగన్ సీఎం కావడంతో ఇక కడపకు నీటి కష్టాలు తీరుతాయని అందరూ భావించారు. ఐదేళ్లకు కానీ కడపవాసులకు అర్థం కాలేదు. జగన్ సొంత జిల్లాకు కూడా సీఎం కాదు.. కేవలం పులివెందులకే సీఎం అన్నట్లుగా తన సొంత నియోజకవర్గానికి నిధులు ధార బోశారు. పులివెందుల అభివృద్ధిపై ఎవరూ అభ్యంతరం చెప్పరు. అదే స్థాయిలో కనీసం జిల్లా హెడ్‌క్వార్టర్ అయిన కడపకు కూడా నిధులు కేటాయించకపోవడం అన్యాయమని పలువురు అంటున్నారు. జిల్లా వాసి ఐదేళ్లు సీఎంగా ఉన్నా.. కడప నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. అయినా.. నిద్దరలేసిన దగ్గర నుంచి వైసీపీ వారు 'గడప గడపకూ మన ప్రభుత్వం' అంటూ నగరంలో ప్రతి గడప తొక్కుతూ ప్రచారం చేస్తున్నారు. గడప గడపకూ తాగునీరివ్వాలనే విషయం మాత్రం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

(కడప-ఆంధ్రజ్యోతి): సొంత జిల్లావాసి జగన్ సీఎం కాగానే కడపకు మహర్దశ పడుతుందని భావించారు. ఇక కడప నీటి కష్టాలు తీరుతాయని అందరూ భావించారు. అయితే చంద్రబాబుపై కక్ష పెట్టుకున్న జగన్.. ఆయన అధికారంలోకి వచ్చాక టీడీపీ హయాంలో చేపట్టిన పనులన్నీ రద్దు చేశారు. టీడీపీ హయాంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి కడప దాహార్తి తీర్చేందుకు లింగంపల్లె వద్ద రూ.75 కోట్లతో సబ్ సర్ఫేజ్ చెక్‌డ్యాంకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ప్రతిపాదన అంచనాలు సిద్ధమయ్యాయి. పనులు మొదలుపెట్టాల్సిన సమయంలో ప్రభుత్వం మారింది. జగన్ ప్రభుత్వం ఆ ప్రతిపాదనలను రద్దుచేసింది.. సరే దానికన్నా మెరుగైన పథకం తీసుకువస్తారేమోనని కడప జనం భావించారు. తొలి నాలుగున్నర సంవత్సరాలు పట్టించుకోకుండా చివరిలో సుమారు రూ.600 కోట్ల వ్యయంతో బ్రహ్మంసాగర్ నుంచి నీళ్ల తెస్తామంటూ ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. ఇటీవలే దానికి టెండర్ల దశ పూర్తయింది.

నాలుగున్నరేళ్లు పట్టించుకోకుండా..

అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే శంకుస్థాపన చేస్తే అది చిత్తశుద్ధి.. అధికారం పోయే ఆరు నెలల ముందు శంకుస్థాపన చేస్తే అది మోసం అంటూ 23 డిసెంబరు 2019న సీఎం జగన్ జమ్మలమడుగులో ఉక్కు ఫ్యాక్టరీకి శంకుస్థాపన సందర్భంగా చెప్పారు. మరి ఐదేళ్ల అధికారంలో ఉండి.. నాలుగున్నరేళ్ల పట్టించుకోకుండా.. ఎన్నికలకు ఆరునెలల ముందు బ్రహ్మంసాగర్ నుంచి నీరు తీసుకొచ్చి కడప దాహార్తి తీరుస్తామంటూ చెప్పడం చూసి జనం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో విశేషమేమంటే వైసీపీ ఆవిర్భావం తరువాత 2014లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో అప్పుడు వైసీపీ పాలకవర్గమే ఉండేది. ఇప్పుడూ వైసీపీ పాలకవర్గమే ఉంది. వరుసగా రెండుసార్లు అంజద్‌బాషానే ఎమ్మెల్యేగా గెలిచారు. ఐదేళ్లుగా ఆయన మంత్రిగా కూడా ఉన్నారు.

రెండోసారి మేయర్‌గా సురేశ్‌బాబు ఉన్నా..

కడప జనం జగన్‌పై ప్రేమతో ఓట్లు వేస్తే.. ఏదో మూడు, నాలుగు రోడ్లు పూర్తిచేసి ఇదే అభివృద్ధి అంటూ చేతులు దులుపుకుంటే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. జనాలకు మౌలిక వసతులలో నీరు ప్రధానం. వేసవికి ముందే నగరంలో నీటిఎద్దడి మొదలైపోయింది. నీటి కోసం కడప జనం ఎదురు చూస్తున్నారు. ఎప్పుడు వస్తాయో తెలియదు. వచ్చినా ఏ టైంకు వస్తాయో తెలియదు. ఇక కార్పొరేషన్ మేయరుగా సురేశ్‌బాబు రెండో పర్యాయం కొలువుదీరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కడప నీటి సమస్య కోసం ప్రభుత్వంపై వత్తిడి తెచ్చింటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదంటారు. పులివెందులలో జగన్ వాటర్ గ్రిడ్ ద్వారా ప్రతి పల్లెకు తాగునీటిని ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు. కనీసం జిల్లా హెడ్‌క్వార్టర్ అయిన కడప వాసులకు 24గంటలూ వద్దు.. రోజులో మూడూ నాలుగు గంటలైనా నీళ్ల ఇవ్వకుంటే ఎలా అంటూ జనం వాపోతున్నారు.

అధికారుల భగీరథయత్నం

వర్షాలు లేకపోవడంతో పెన్నా ఒట్టిపోయింది. కడపకు దౌర్భాగ్యమేమంటే నీటిని స్టోరు చేసుకునే సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు లేవు. నీటి ముప్పు పసిగట్టిన కమిషనర్ ప్రవీణ్ చంద్ మైలవరం నుంచి నీటిని తీసుకువచ్చే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఆయన ఆదేశాల మేరకు డీఈ కరీముల్లా, నీటిపారుదల శాఖ అధికారులు మైలవరం నుంచి కడపకు నీటిని విడుదల చేశారు. ఆ నీరు మైలవరం డ్యాంనుంచి సుగమంచిపల్లె, ప్రొద్దుటూరు, ఆర్టీపీపీ, పోట్లదుర్తి, కోగటం, గంగవరం, ఏటూరు, త్రిపురవరం, ఆదినిమ్మాయపల్లె మీదుగా 60 కి.మీ ప్రయాణించి లింగంపల్లె పెన్నాకు చేరుకోనుంది. మైలవరం నుంచి 200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నప్పటికీ ఎండలు కావడంతో చుక్కనీరు లేని పెన్నాలో ఎక్కువగా ఇంకిపోతోందని అంటున్నారు. మరో వారం పదిరోజుల్లో కానీ లింగంపల్లెకు పూర్తిస్థాయిలో చేరే పరిస్థితి లేదు. ఈ నీటిని రైతులు వాడుకోకుండా ఉండేందుకు కార్పొరేషన్ అధికారులు ఉదయం లేచినప్పటి నుంచి నీరు వచ్చే ప్రాంతాలు పర్యవేక్షిస్తూ వ్యవసాయ మోటర్లు ఆడకుండా చూస్తున్నారు.

అవసరమైన నీరు ఏదీ?

కడప కార్పొరేషన్‌లో రోజుకు 54.00 ఎంఎల్‌డీ తాగునీరు అవసరం ఉంది.. అయితే ప్రస్తుతం వస్తున్నది 37.80 ఎంఎల్‌డీ మాత్రమే. అవసరానికి సరఫరాకు చాలా వ్యత్యాసం ఉంది. జగన్ ప్రభుత్వం వచ్చిన వెంటనే చంద్రబాబు చేపట్టిన సర్ఫేజ్ డ్యాం కొనసాగించినా, లేదా దానికంటే మెరుగైన ప్రాజెక్టు మొదలుపెట్టినా ఈ పాటికి పూర్తయ్యేది. దాన్ని రద్దు చేయడం, ఎన్నికల ముందు తెలుగుగంగ ప్రాజెక్టు అంటూ తెరపైకి తెచ్చి జనాలను ఇబ్బందికి గురి చేస్తున్నారు.



మైలవరం నుంచి కాలువలో వస్తున్న నీరు

కడప జనాభా	: 4 లక్షలు
కడప వాసులకు రోజూ కావాల్సిన నీరు	: 54.00 ఎంఎల్‌డీ
ప్రస్తుతం సరఫరా చేస్తున్నది	: 37.80 ఎంఎల్‌డీ
కొరత	: 16.20 ఎంఎల్‌డీ
రోజూ ఒక మనిషికి కావలసిన నీరు	: 135 లీటర్లు
సగటున ఇచ్చేది	: 65 లీటర్లు
నీటి సౌలభ్యం ఉండేది	
లింగంపల్లె స్కీం	: 30.36 ఎంఎల్‌డీ
గండి	: 12.12 ఎంఎల్‌డీ
మాదనపల్లె	: 2
బోర్‌వెల్స్ ద్వారా	: 5.56
మొత్తం	: 49.92
కానీ సరఫరా అయ్యేది	: 37.80 ఎంఎల్ఎడీ



మైలవరం నుంచి పెన్నాలోకి వచ్చిన నీటిని పరిశీలిస్తున్న డీఈ బృందం

సీతారాముల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

- 16 నుంచి బ్రహ్మోత్సవాలు
- 22 కల్యాణోత్సవం : కలెక్టర్

ఒంటిమిట్ట, మార్చి 25 : కోదండరాముని కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. సోమవారం స్థానిక పరిపాలన భవనం సమావేశపు హాలులో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, జేసీ గణేశ్‌కుమార్, కడప నగర కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌తో కలిసి కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలపై కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 16 నుంచి 26వ తేదీ వరకు కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయన్నారు. అందులో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు సంయుక్తంగా, సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలన్నారు. 22వ తేదీ జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి, గవర్నర్ తదితర ప్రముఖులు వచ్చే అవకాశం ఉన్నందున భారీ భక్తజనం సందోహం రావచ్చనే అంచనాతో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. 22వ తేదీ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల సమయంలో కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎక్కడా రాజకీయ నాయకుల ఫొటోలు, బ్యానర్లు, కటౌట్‌లు కనిపించకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో గంగాధర్ గౌడ్, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, సీవీఎస్‌వో నరసింహకిషోర్, ఎస్‌వీబీసీ సీఈవో షణ్ముఖకుమార్, సీఈ నాగేశ్వరరావు, డిప్యూటీ ఈవో నటేషబాబు, కడప డీఎస్పీ షరీఫ్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోదండరాముని బ్రహ్మోత్సవ వివరాలు

ఏప్రిల్ 16న సాయంత్రం అంకురార్పణ, 17న ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం శేష వాహనసేవ, 18న వేణుగానాలంకారం, సాయంత్రం హంస వాహనం, 19న ఉదయం వటపత్రశాయి అలంకారం, సాయంత్రం సింహ వాహన సేవ, 20న నవనీత కృష్ణాలంకారం, సాయంత్రం హనుమత్‌సేవ, 21న మోహినీ అలంకారం, సాయంత్రం గరుడ సేవ ఉంటాయి. 22న శివధనుర్బాలంకారం, సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు కల్యాణోత్సవం, అనంతరం గజవాహనం, 23న ఉదయం రథోత్సవం, 24న కాళీయమర్దనాలంకారం, సాయంత్రం అశ్వవాహన సేవ, 25న చక్రస్నానం, సాయంత్రం ధ్వజారోహణం, 26న సాయంత్రం పుష్పయాగం కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

అవి ప్రభుత్వ హత్యలే..



ఆత్మహత్య చేసుకున్న పాల సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న టీడీపీ నిజనిర్ధారణ కమిటీ సభ్యులు

- వైసీపీకి తొత్తులుగా ఉన్న అధికారులపై చర్యలు తప్పవు
- మాజీ మంత్రి కొల్లు రవీంద్ర
- రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి
- కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్

ఒంటిమిట్ట, మార్చి 25: కొత్తమాధవరంలో చోటు చేసుకున్న చేనేత కార్మికుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలేనని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని సోమవారం సాయంత్రం టీడీపీ నిజనిర్ధారణ కమిటీ పరామర్శించింది. రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చిన్నబాబు, తొగట సాధికారిక కమిటీ కన్వీనర్ మడక చక్రధర్, టీడీపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కుటుంబానికి టీడీపీ నాయకులు ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. ఘటన జరిగిన విషయాన్ని పెద్ద కూతురు లక్ష్మీప్రసన్న ద్వారా టీడీపీ నాయకులు వివరాలు సేకరించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆత్మహత్యకు పాల్పడిన పాల సుబ్బారావు పెద్ద కుమార్తె లక్ష్మీప్రసన్నతో ఫోన్‌లో మాట్లాడారు. టీడీపీ అండగా ఉంటుందని, అధైర్య పడవద్దని తెలిపారు. సొంత చెల్లిలాగా చూసుకుంటానని, పార్టీ పరంగా ఆదుకుంటామని, అధికారంలోకి వచ్చిన వెంటనే భూమి హక్కు పత్రాలను అందజేస్తామని ఆమెకు హామీ ఇచ్చారు.

అధికారులపై చర్యలు తప్పవు

వైసీపీ నాయకులకు తొత్తులుగా ఉన్న అధికారులపై చర్యలు తప్పవని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన అధికారులపై విచారణ చేపడతామని తెలిపారు. అధికార పార్టీ వారు కానీ అధికార యంత్రాంగం కాని ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారా, ప్రభుత్వం నుంచి ఏమి హామీ ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. పాల వెంకటచలపతి పేరుతో ఉన్న రికార్డులను ట్యాంపరింగ్ చేసి అన్యాయం చేశారన్నారు. క్రికెట్ బెట్టింగ్, జూదం ఇతర వ్యసనాల వల్ల చనిపోయారని అధికారులు ప్రకటించడం సిగ్గుచేటన్నారు.

కబ్జాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ

కబ్జాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ ప్రభుత్వమని పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆస్తులకు వైసీపీ ప్రభుత్వంలో రక్షణ కరువైందని ఎక్కడ చూసినా భూఆక్రమణలు దోపిడీలే తప్ప రాష్ట్రంలో అభివృద్ధి కనబడలేదన్నారు. తల్లి, తండ్రి, చెల్లెల్ని కోల్పోయి అనాథగా ఉన్న లక్ష్మీప్రసన్న కుటుంబాన్ని చూస్తుంటే రాష్ట్రంలో వైసీపీ అరాచకం ఏ విధంగా ఉందో కళ్లకు కట్టినట్లు కనబడుతుందన్నారు. బలహీన వర్గాలకు, బీసీలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. మృతి చెందిన చేనేత కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా టీడీపీ తరఫున అందిస్తామని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే లక్ష్మీప్రసన్నకు ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇస్తామని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ నాయకులు పీరయ్య, గజ్జల నరసింహారెడ్డి, గన్నె సుబ్బనరసయ్యనాయుడు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి : ఎంపీ

ఆత్మహత్యకు పాల్పడిన చేనేత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం మృతుల కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. తానూ చేనేత సామాజిక వర్గంలో జన్మించానని, చేనేత కుటుంబం ఆపదలో ఉందని, వారిని ఆదుకోవడానికి కర్నూలు నుంచి వచ్చానని తెలిపారు. కుటుంబం ఆత్మహత్యకు కారకులైన రెవెన్యూ అధికారును సస్పెండ్ చేయాలని, లక్ష్మీప్రసన్న చదువుకు ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు.అన్యాయంపై పోరాడేందుకు బీసీలంతా నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మావిళ్ల శ్రీహరి, అడ్వకేట్ రామదాసు, ఆలూరు వెంకటసుబ్బయ్య, నామాల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

జనం కోసమా.. ఓట్ల కోసమా?

- అమలులో ఎన్నికల కోడ్
- అయినా.. నేడు జడ్పీ సర్వ సభ్య సమావేశం
- జడ్పీ చైర్మనే వైసీపీ రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి
- వైసీపీ ఎమ్మెల్యేలు.. ఎంపీలూ అభ్యర్థులే

కడప (రూరల్), మార్చి 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ మేరకు ఆయా పాలక మండళ్ల ప్రజలను ప్రభావితం చేసే ఎలాంటి నిర్ణయాలను తీసుకోకూడదు. ఈ నేపథ్యంలో మంగళవారం జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని జడ్పీ పాలక మండలి నిర్వహిస్తోంది. పాలకమండలి సభ్యులంతా వైసీపీ కి చెందినవారే ఉన్నారు. జడ్పీ చైర్మన్‌గా ఉంటున్న ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని రాజంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ ఇప్పటికే ప్రకటించింది. ఈ మేరకు ఆయన ఎన్నికల ప్రచారాన్ని కూడా మొదలుపెట్టారు. అయితే ఆయన జడ్పీ చైర్మన్ హోదాలో నేటి జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు సమావేశానికి హాజరుకావాలని జడ్పీ సీఈవో పేరున మైనార్టీ సంక్షేమశాఖ మంత్రికి, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి, ఎంపీలకు, ఎమ్మెల్యేలకు ఆహ్వానం పంపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలందరూ ఇప్పటికే వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. వీరి ఆధ్వర్యంలో నేడు జడ్పీ సర్వసభ్యసమావేశాన్ని నిర్వహిస్తున్నది జనం కోసమా లేక ఎన్నికలలో ఓట్లకోసమా.. అన్న సందేహాలను కొందరు అధికారులు వెలిబుచ్చుతున్నారు.

ఇప్పటి దాకా మొక్కుబడిగానే..

2021 డిసెంబర్ 12న మొదటి జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అప్పటి నుంచి సమావేశాలు కొనసాగుతున్నా ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏనాడూ అర్థవంతమైన సమావేశాన్ని నిర్వహించలేదు. మొక్కుబడిగా కొనసాగిస్తు వచ్చారు. సమావేశాల పేరిట లక్షల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చుచేయడం తప్ప జిల్లా ప్రజలకు ఒరగబెట్టింది ఏమీలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉన్నఫలంగా ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో వైసీపీ ప్రజాప్రతినిధులు జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించడం వెనుక ఏదో మతలబు ఉందనే మిమర్శలు వినిపిస్తున్నాయి.

సీఈవో సెలవులో ఉన్నా..

జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. నాలుగు రోజుల క్రితమే ఆయన హార్ట్‌కు స్టంట్ వేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ మేరకు ఆయన నెల రోజులు లీవ్ కోరుతూ కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. ఇలాంటి సమయంలో ఆయన సంతకంతో నేడు జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు అందరికీ ఆహ్వానాలను పంపారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రభావితం చేయడానికే సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

ఉక్కిరిబిక్కిరవుతున్న అధికారులు

సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్ అమలు కావడంతో జిల్లా అధికారులు ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ లో తలమునకలై ఉన్నారు. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి అనునిత్యం ఎన్నికలకు సంబంధించిన ఏదో ఒక సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జడ్పీ సర్వసభ్య సమావేశం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు అధికారులకు ఆహ్వానాలు పంపారు. తరువాత అనివార్య కారణాలవలన ఉదయం 9 గంటలకే సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సందేశాన్ని పంపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఆయాశాఖల జిల్లా అధికారులందరు తమ పూర్తిస్థాయి ప్రగతి నివేదికలతో హాజరుకావాలని తెలిపారు. దీంతో ఎన్నిల విధులలో బిజీగా ఉన్న అధికారులు ఉన్నఫలంగా ప్రగతి నివేదికలను తయారీ చేయాల్సి రావడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

ఇప్పుడు గుర్తొచ్చామా..?

- వైసీపీ గెలుపుకోసం స్థానిక ఎన్నికల్లో లక్షలు ఖర్చు పెట్టుకున్నాం
- అయినా మమ్మల్ని ఎవరూ పట్టించుకోలేదు
- జనాలను తోలడం మా వల్ల కాదు..
- వైసీపీ నేతలు రివర్స్

(కడప-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఇడుపులపాయ నుంచి బయల్దేరి ప్రొద్దుటూరులో సిద్ధం సభ నిర్వహించ నున్నారు. ఈ సభకు భారీ జన సమీకరణ చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రతి నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున జనసమీకరణ చేసేందుకు ఎమ్మెల్యేలు గ్రామస్థాయి నుంచి సర్పంచ్‌లు, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు టార్గెట్ పెడుతూ వచ్చారు. అయితే ఇప్పుడు కొందరు నేతలు ఎమ్మెల్యేలపైనే రివర్స్ అవుతు న్నారు. ప్రభుత్వం వచ్చి ఐదేళ్ల కావస్తోంది. మమ్మల్ని ఇంతవ రకు పట్టించుకోలేదు.. ఎవరూ పలకలేదు. జనాలను మాత్రం తోలమంటున్నారు. మా వద్ద డబ్బులు లేవు అంటూ సమావేశా ల్లో ముఖం మీదనే చెబుతుండడంతో ఎమ్మెల్యేలు నివ్వెరపో తున్నారని అంటున్నారు.

జన సమీకరణలో భాగంగా మైదుకూరు ఎమ్మెల్యే రఘురామరెడ్డి సమావేశం నిర్వహించగా.. బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి, అదే మండలానికి చెందిన మోహన్‌రెడ్డి వాగ్వాదానికి దిగి ఘర్షణ స్థాయికి వెళ్లడం చర్చనీయాంశమైంది. బ్రహ్మంగారిమఠం మండలంలోని దిరసవంచ గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి స్థానిక సంస్థల ఎంపీటీసీ ఎన్నికల్లో డబ్బు ఖర్చు పెట్టి నష్టపోయాం, మమ్మల్ని ఎవరూ పట్టించుకోలేదు, ఇప్పుడు బస్సుయాత్రకు జనాలను తరలించమంటున్నారు.. మా వల్లకాదు, మీరే జనాలను తరలించుకోవాలంటూ చెప్పడం ఘర్షణకు దారి తీసిందని అంటున్నారు. ఈ ఒక్క మండలమే కాదు.. జిల్లాలో పలుచోట్ల వైసీపీలో ఇదే పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు.

కడపలో కార్పొరేటర్ల అలక

ప్రొద్దుటూరు జగన్ సభకు జనాలను తరలించాలని కార్పొరేటర్లకు టార్గెట్ పెట్టారు. ఈ మేరకు సమావేశాలు కూడా ఏర్పాటు చేశారు. అయితే కొందరు మేం ఇన్నాళ్లకు గుర్తుకు వచ్చామా, మమ్మల్ని పట్టించుకోలేదంటూ సమావేశంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్పొరేటర్లుగా అయ్యేందుకు లక్షలు ఖర్చు పెట్టాం.. మమ్మల్ని పట్టించుకోలేదు. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులు కావాల్సిన వారికి ఇచ్చుకున్నారు. పదవులు వారికి.. జనాలను తరలించే భారం మాకా అంటూ కొందరు కార్పొరేటర్లు వాపోతున్నట్లు చెబుతున్నారు. మొత్తానికి సీఎం జగన్ బహిరంగ సభతో వైసీపీలో లుకలుకలు బయటపడుతున్నాయి.

జగన్ బస్సు యాత్ర ఏర్పాట్లపై ఎస్పీ పరిశీలన

ఎర్రగుంట్ల, మార్చి 25: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇడుపులపాయ నుంచి చేస్తున్న బస్సు యాత్రపై ఎర్రగుంట్లలోని పోలీసులకు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పలు సూచనలు చేశారు. సోమవారం సాయంత్రం ఆయన ఇంటలిజెన్స్, ఇతర అనుబంధ పోలీసు శాఖాధికారులతో కలసి ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలిలో పర్యటించారు. నాలుగు రోడ్ల చుట్టూ ఉన్న ట్రాఫిక్, ఇతర ఏర్పాట్లపై సూచనలు చేశారు. సామాన్యులకు, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బుదుల్లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కిందిస్థాయి అధికారులకు సూచనలిచ్చారు. అర్బన్ సీఐ ఈశ్వరయ్య, ఎస్ఐలు పాల్గొన్నారు.



ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలిలో బస్సు యాత్ర వెళ్లే దారిని పరిశీలిస్తున్న ఎస్పీ

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గుర్రంకొండ మౌలాలి (ఫైల్)

రామాపురం, మార్చి 25: మండలంలోని బండపల్లి పంచాయతీ ఐరిస్ హోటల్‌లో పనిచేస్తున్న ఓ వ్యక్తి ఈనెల 17న ఒంటిపై పెట్రోల్ పోసుకొని కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దమండ్యం మండలానికి చెందిన గుర్రంకొండ మౌలాలి (32)కి గత పది సంవత్సరాల క్రితం చిన్నమండెం మండలం టౌన్‌కు చెందిన వహీదాతో వివాహం జరిగింది. ఇరువురికి ఇంతవరకు పిల్లలు కలగలేదు. భార్యాభర్తలు ఇరువురు కలిసి ముస్లిం సంప్రదాయం ప్రకారంగా 40 రోజుల క్రితం విడాకులు తీసుకున్నారు. కాగా తన అత్తగారితో నా భర్త.. కొత్త ఇళ్లు కొనివ్వు.. నేను నా భార్యను కాపురానికి పిలుచుకుంటా అని ఫోన్ చేసి చెప్పేవాడని, అయితే తమ అత్త గారు తన వద్ద అంత డబ్బు లేదని కుమారుడితో ఫోన్‌లో చెప్పినట్లు పోలీసులు తెలిపారు. తల్లి ఇల్లు కొనివ్వమంటే తన వద్ద స్తోమత లేదని చెప్పడం, భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది ఈ నెల 17న ఐరిస్ హోటల్ వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. వెంటనే పొత్తుకూరుపల్లెకు చెందిన బసిరెడ్డి మరికొందరు కలిసి మంటలను ఆర్పి తీవ్ర గాయాలతో ఉన్న వ్యక్తిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ ఎల్‌వీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తేనెటీగల దాడిలో ఉపాధి కూలీ మృతి

కమలాపురం రూరల్, మార్చి 25 : కమలాపురం మండలం జంబాపురం పంచాయతీకి చెందిన గంగిరెడ్డి (60) తేనెటీగల దాడిలో మృతి చెందాడు. సోమవారం ఉదయం ఉపాధి కూలీకి వెళ్లిన గంగిరెడ్డి కాల్వ పని చేస్తుండగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో ఆయన స్పృహ కోల్పోయి పడిపోయాడు. తోటి కూలీలు ఆయనను 108 ద్వారా కమలాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతి చెందిన ఆయన కుటుంబానికి ఉపాధిహామీ తరఫున రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని ఏపీవో పార్థసారథి తెలిపారు.

వ్యక్తిపై కొడవలితో దాడి


చికిత్స పొందుతున్న లక్ష్మినారాయణ

లింగాల, మార్చి 25: పాత కక్షలు మనసులో ఉంచుకుని కత్తితో దాడి చేయడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పులివెందుల రూరల్ సీఐ బాలమద్దిలేటి తెలిపిన వివరాల మేరకు... తమ కుటుంబ సభ్యులతో వెన్నపూస నారాయణరెడ్డి అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ ఐదు నెలల క్రితం తాతిరెడ్డిపల్లెకు చెందిన ఆకుల లక్ష్మినారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కక్ష పెంచుకున్న నారాయణరెడ్డి ఆదివారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో లక్ష్మినారాయణపై కొడవలితో దాడి చేశాడు. దీంతో తల, ముఖంపై గాయాలైన లక్ష్మినారాయణను పులివెందులలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అనంతపురం తరలించినట్లు తెలిపారు. సంఘటనాస్థలాన్ని పరిశీలించి నారాయణరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మృతి చెందిన సురేశ్

ఖాజీపేట, మార్చి 25: నెల్లూరు జిల్లా మర్రిపాడు సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న సురేశ్ (25)ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఖాజీపేట మండలం ఆంజనేయకొట్టాలు పంచాయతీలోని పుల్లూరు ఎస్సీ కాలనీకి చెందిన సురేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. అయితే సోమవారం పనినిమిత్తం వెళుతుండడంతో మర్రిపాడు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం భార్య సునీత, బంధువులకు తెలుపడంతో ఆ కాలనీ శోకసముద్రంలో మునిగింది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఘర్షణ కేసులో ముగ్గురికి ఏడాది జైలు శిక్ష

మైలవరం, మార్చి 25: మండల పరిధిలోని వేపరాల గ్రామంలో 2015వ సంవత్సరంలో మద్దూరి పెద్ద శంకరయ్యను కట్టెలతో కొట్టి ఘర్షణకు పాల్పడిన ఘటనలో జడ్జి సోమవారం ముగ్గురికి ఏడాది జైలు శిక్ష విధించినట్లు మైలవరం ఎస్ఐ రెడ్డి సురేశ్ తెలిపారు. తూలబండి సుబ్బరాయుడు, తూలబండి లక్ష్మీదేవి, తూలబండి చెన్నకేశవులకు జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి ఏడాదిపాటు జైలుశిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు ఎస్ఐ సోమవారం తెలిపారు. 2015లో నమోదైన కేసును విచారించిన అనంతరం నిందితులను దోషులుగా నిర్ధారించి శిక్ష విధించినట్లు తెలిపారు.

కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు

జమ్మలమడుగు, మార్చి 25: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు గ్రామం సొసైటీ కాలనీ వద్ద ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలు టపాసులు పేల్చారని సమాచారం తెలుసుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ వచ్చి తనిఖీ చేసినట్లు పోలీసులు తెలిపారు. టపాసులు పేల్చిన వారిని విచారించి జమ్మలమడుగు అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు, సీఐ కరుణాకర్‌కు తెలియజేశారు. దీంతో ఒకరిపై కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాహనాల తనిఖీలో రూ.లక్ష స్వాధీనం



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నందలూరు, మార్చి 25: కడప-చెన్నై ప్రధాన రహదారిలోని నందలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు వద్ద రాజంపేట డీఎస్పీ వి.ఎన్.కె.చైతన్య ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీలో ఎటువంటి ఆధారాలు లేని కారులోని రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు. కడప నుంచి చెన్నైకి వెళుతున్న ఈ కారులో నగదుకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి నగదును ఎన్నికల అధికారికి అప్పజెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐలు మద్దయ్య ఆచారి, మంజునాథరెడ్డి, ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్, పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దుకాణం నుంచి బెల్ట్‌షాపులకు మద్యం

పట్టుకున్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు

ప్రొద్దుటూరు, మార్చి 25 : ప్రొద్దుటూరులో ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి బెల్టు షాపులకు మద్యం సరఫరా చేయడంపై కడప స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో బొమ్మల మణి అనే వ్యక్తిని అరెస్టు పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్దనుంచి 96 ఏపీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బొమ్మల మణిని విచారించగా ఆ మద్యం బాటిళ్లు గాంధీరోడ్డులోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి సేల్స్‌మెన్లు రాజేష్, సుబ్బారెడ్డి సరఫరా చేసినట్లు అంగీకరించారు. దీంతో వారిని అరెస్టు చేశారు. వీరిని కోర్టుకు హాజరుపరుచగా రిమాండుకు తరలించారు.ఈ దాడులలో ఎస్ఐ కిశోర్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నట్లు సీఐ మహేష్ కుమార్ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. నలుగురికి గాయాలు

వేంపల్లె, మార్చి 25: ఇరువర్గాల ఘర్షణలో నలుగురు కత్తిపోట్లకు గురయ్యారు. వేంపల్లె సీఐ చాంద్‌బాషా కథనం మేరకు ఆదివారం రాత్రి పట్టణంలోని గండి రోడ్డులో నరసింహులు, శివ, శ్రీనివాసులును నాగేంద్ర అనే వ్యక్తి దూషించడంతో పాటు కత్తితో దాడి చేశాడు. దీంతో వారు నాగేంద్రను వెంబడించి దాడి చేశారు. ఈ దాడిలో నలుగురికీ గాయాలు కాగా వారిని కడప రిమ్స్‌కు తరలించారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

ముద్దనూరు మార్చి 25: స్థానిక రైల్వేస్టేషన్ ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం ఆదివారం చోరీకి గురైనట్లు సీఐ దస్తగిరి తెలిపారు. జమ్మలమడుగు టౌన్ నాగుకట్టకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి రైల్వే ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 22 వ తేదీన డ్యూటీ నిమిత్తం రైల్వే స్టేషన్ ముందు ద్విచక్ర వాహనం పార్కింగ్ చేసి వెళ్లాడు. తిరిగి ఆదివారం రాత్రి వచ్చి చూడగా ద్విచక్రవాహనం కల్పించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


కులరహిత దేవుడు..

- కులరహిత సమాజం కోసం జీవితాన్ని త్యాగం చేసిన త్యాగధనుడు నగిరిపాడు రంగనాయకుడు
- 28 నుంచి రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- దళితుల తొలిపూజే రంగనాయకస్వామి ఆలయ ప్రత్యేకత

నగిరిపాడు రంగనాథుడు


రంగ నాయక స్వామి ఆలయ ప్రాంగణం


రంగనాయక స్వామి మూలవిరాట్


ఆలయంలో ఉన్న అలనాటి పాదుకలు


శిథిలావస్థలో ఉన్న బ్రహ్మంగారి కాలజ్ఞానం

రాజంపేట, మార్చి 25: తెలుగు రాష్ట్రాలలోనే చిట్వేలి రంగనాయకస్వామి ఆలయానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ ఆలయంలో దళితుల తొలిపూజ ప్రత్యేకత. కులరహిత సమాజం కోసం నగిరిపాడు రంగనాయకస్వామి తన జీవితాన్ని త్యాగం చేసి జీవసమాధి అవ్వడం ఇక్కడి ప్రత్యేకత. బ్రహ్మంగారి వరపుత్రుడిగా పేరుగాంచిన నగిరిపాడు రంగనాయకస్వామి ఆలయంలో బ్రహ్మంగారు స్వయంగా రచించిన తాళపత్ర గ్రంథాలు ఉన్నాయి. రంగనాయకుడు జీవ సమాధి అయినప్పుడు ఆనాటి అగ్నిగుండంలో బయల్పడిన స్వామి వారి పాదుకలు, యోగదండం నేటికీ పూజలందుకుంటున్నాయి. ఈనెల 28 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు 11 రోజులు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి.

17వ శతాబ్దంలో కులరహిత సమాజం కోసం బ్రహ్మంగారి వరపుత్రునిగా జన్మించిన నగిరిపాడు రంగనాయక స్వామి కుల రహిత సమాజం కోసం తన జీవితమే త్యాగం చేశాడు. తన జీవ సమాధికి కావాల్సిన స్థలాన్ని తన ప్రియశిష్యుడు కేసారపు మారయ్య ఇచ్చినందుకు ప్రతి ఏడాది ఆరంభంలో విజయదశమి రోజున వారికి తొలిపూజ జరగాలని నాడు స్వామి ఆదేశించడం అది నేటికీ కొనసాగుతోంది. ఆలయ ముఖద్వారం ఎదుటే స్వామికి భూమి ఇచ్చిన దళిత కుటుంబానికి చెందిన కేసారపు మారయ్యకు చెందిన ఆలయం నిర్మించి ఉండటం ఈ ఆలయం విశిష్టత. తిరుమల కొండల నుంచి ప్రవహించే గుంజన నదీ తీరాన పచ్చని పంట పొలాల మధ్య చిట్వేలి-రైల్వేకోడూరు రహదారి పక్కన కొలువుదీరిన రంగనాయకస్వామి ఆలయం రాష్ట్రంలోనే ఓ విశిష్ట ఆలయంగా పేరుగాంచింది.

నగరిపాడును పరిపాలించిన జగ్గరాజు కుమారుడు రంగరాజు 17-04-1692 తేదీ జన్మించాడు. ఈయన 16వ ఏటలోనే దేశ సంచారం చేశారు. జగ్గరాజు, జగ్గమ్మ దంపతులు బ్రహ్మంగారిని పూజించగా ఆయన వరం వల్ల రంగరాజు జన్మించాడని ఈ ప్రాంతీయుల విశ్వాసం. రంగరాజు జన్మించిన ఒక సంవత్సరానికి 1693లో బ్రహ్మంగారు జీవ సమాధి కావడం గమనార్హం. రంగరాజు అలనాడే రాజరిక కుటుంబ విధానాలను వ్యతిరేకించి కులమతాలకు వ్యతిరేకంగా పోరాడారు. రాచరికం వద్దు రాజభోగాలు అసలే వద్దు అని ఆనాడే ఆయన సంచార జీవితాన్ని అలవాటు చేసుకున్నారు. రాష్ట్రంలో అనేక గ్రంథాల్లోనూ, బ్రహ్మంగారు రాసిన కాలజ్ఞానంలోనూ రంగరాజు బ్రహ్మంగారి మనవరాలు ఈశ్వరమ్మను పెళ్లి చేసుకోవాలని రాసి ఉంది. అయితే ఆనాడు రాజ కుటుంబానికి చెందిన రంగరాజుకు ఈశ్వరమ్మను పెళ్లి చేసే అంశంలో ఇరువర్గాలు ససేమిరా ఒప్పుకోలేదు. విశ్వ బ్రాహ్మణ కులానికి చెందిన బ్రహ్మంగారి మనవరాలిని రంగరాజుకు ఇచ్చి పెళ్లి చేసే అంశంలో చివరకు ఈశ్వరమ్మ తల్లిదండ్రులైన బ్రహ్మంగారి కుమారులు కూడా ఒప్పుకోలేదు. ఇక రంగరాజు చేసేది లేక తన సంచారంలో బనగానపల్లెకు వెళ్లి గరిగిరెడ్డి అచ్చమ్మ ఇంటి ముందు చింత చెట్టు కింద బ్రహ్మంగారు దాచి ఉంచిన కాలజ్ఞాన పత్రాలను తెరిచి అందులో కొన్నింటిని తీసుకుని అందులో అంశాలు చదువగా ఈ యుగంలో ఈశ్వరమ్మతో పెళ్లి జరగడం కష్టమని కులమతాలు అంతరించిన నాడే ఈశ్వరమ్మతో రంగరాజు వివాహం జరుగుతుందని అందులో ఉండగా చదివి పెళ్లి చేసుకోవడాన్ని రంగరాజు విరమించుకున్నారు. రంగరాజు తీసుకువచ్చిన బ్రహ్మంగారి కాలజ్ఞాన తాళపత్ర గ్రంథాలు నేటికీ నగరిపాడు రంగరాజుస్వామి ఆలయంలో ఉన్నాయి. రంగరాజు చేసేది లేక నగరిపాడు తిరిగి వచ్చి కులమతాలకు వ్యతిరేకంగా జీవ సమాధి కావడానికి నిర్ణయించారు. ఆయన కొంతకాలం గుండాలకోనలో తపస్సు చేసి 21-02-1717 సంవత్సరంలో నగరిపాడులో అగ్ని సమాధి అయ్యారు. ఆయన దళిత కుటుంబానికి చెందిన కేసారపు మారయ్యకు చెందిన స్థలంలో సమాధి అయ్యారు. అప్పటి నుంచి రంగరాజు స్వామి ఆలయంలో మొదటిగా అరుంధతీయులు పూజలు చేసిన తరువాతే మిగతా వారు పూజ చేయడం ఆనవాయితీగా వస్తోంది. అలాంటి సంప్రదాయం కలిగిన ఆలయం నగరిపాడులో ఉండటం విశేషం. రంగరాజు వివాహం చేసుకోదల్చిన బ్రహ్మంగారి మనువరాలు ఈశ్వరమ్మ కూడా పెళ్లి చేసుకోకుండా జీవ సమాధి కావడం విశేషం. రంగరాజు ఆలయం సమీపంలోనే కంసాలపల్లె వద్ద సద్గురు రంగస్వామి ఆధ్వర్యంలో ఈశ్వరమ్మ ఆలయం ఉంది. పచ్చని పంట పొలాల నడుమ గుంజన నదీ తీరాన నగరిపాడు గ్రామ సమీపంలో రంగరాజస్వామి, ఈశ్వరమ్మ ఆలయం నేడు భక్తుల పూజలతో నిత్య కల్యాణం పచ్చతోరణం అన్న చందంగా అలరారుతున్నాయి. ఈ సందర్భంగా రంగనాయక స్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ పోలిన నాగేశ్వర ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఈనెల 28 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. ఏప్రిల్ 1వ తేదీ రంగనాయక స్వామి అగ్నిసమాధి అయిన సందర్భంగా అదేరోజు రాత్రి 7 గంటలకు బ్రహ్మంగారు రచించిన తాళపత్ర గ్రంథాలు, స్వామి వారి అగ్నిగుండంలో బయటపడ్డ పాదుకలు, యోగదండం, రుద్రాక్షమాల, అడ్డఖడ్గం, బేరికోమటి తక్కెడ పుల్లలు ప్రదర్శింపబడతాయన్నారు. ఈనెల 28 నుంచి 11 రోజుల పాటు ఉదయం, రాత్రి అన్నదానాలు, ప్రత్యేక హరికథలు, బుర్రకథలు, ఇతర భక్తి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. బ్రహ్మోత్సవాలకు కోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె మండలాల ప్రజలు పాల్గొంటారన్నారు.


పోలిన నాగేశ్వర, ఆలయ కమిటీ ఛైర్మన్

వైభవంగా లక్ష్మి నరసింహస్వామి కల్యాణం



మాంగల్యాన్ని భక్తులకు చూపుతున్న వేద పండితులు, ప్రత్యేక అలంకరణలో లక్ష్మి నరసింహస్వామి

వల్లూరు, మార్చి 25 : మాచిరెడ్డిపల్లె లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష్మీ నరసింహ చెంచు లక్ష్మి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే లక్ష్మి నరసింహ మూలమంత్ర గాయత్రి, శతాక్షర, సర్వరక్షాకర నరసింహ, మహావాచస్పత హోమాలు, మహా పూర్ణాహుతి, కలశోద్వాసన, ధ్వజావరోహణ చేశారు. కలశాల్లో ఉన్న అభిషేక జలంతో భక్తులకు సంప్రోక్షణ చేశారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి, చెంచులక్ష్మి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి పుత్తా నరసింహారెడ్డి కుటుంబ సభ్యులు మేళతాళాల నడుమ కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ అనంతరం పుత్తా నరసింహారెడ్డి, సోదరుడు రామచంద్రారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కన్యాదానం చేశారు.

అనంతరం వివిధ పోటీలతో పాటు మధ్యాహ్నం 3 గంటలకు పాలపండ్ల ఎద్దులు, సేద్యపు ఎద్దులకు పోటీలను ప్రారంభించారు. మధ్యాహ్నం 12.30కు భక్తులకు అన్నదాన వితరణ చేశారు. కమలాపురం నియోజకవర్గం నుంచే కాక చుట్టుపక్కల జిల్లాల నుంచి ప్రజలు పెద్దఎత్తున కల్యాణానికి తరలివచ్చారు. పుత్తా చైతన్యరెడ్డి, పుత్తా లక్ష్మిరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో గోల్‌మాల్

- ***రూ.10 లక్షలకు పైగా స్వాహా***
- ***విధుల నుంచి నలుగురు తొలగింపు***
- ***డబ్బులు చెల్లించని ఇద్దరిపై కేసు***

కడప (క్రైం), మార్చి 25 : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. నెల రోజుల వ్యవధిలో రెండు దుకాణాల్లో రూ.10.7 లక్షలకు పైగానే స్వాహా చేశారు. వీరి ప్రవర్తనపై అనుమానం వచ్చిన ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక టీమ్‌లతో తనిఖీ చేసి దుర్వినియోగమైన మొత్తాన్ని రికవరీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రతి మద్యం దుకాణంలో సూపర్‌వైజరుతో పాటు సేల్స్‌మెన్ ఉంటారు. వారిని ఎక్సైజ్ సిబ్బంది పర్యవేక్షిస్తుంటారు. కడప నగర శివారులోని పులివెందుల రోడ్డులో ఉన్న దుకాణంతో పాటు ఇర్కాన్ సర్కిల్ సమీపంలో ఉన్న మరో మద్యం దుకాణంలో పనిచేస్తున్న సిబ్బంది మద్యం అమ్మిన డబ్బులను స్వాహా చేస్తున్న విషయం గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. కడప ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరు కృష్ణకుమార్ ఆధ్వర్యంలో విచారణ చేశారు. దాదాపు పులివెందుల రోడ్డులోని మద్యం దుకాణంలో రూ.2.32 లక్షలు, ఇర్కాన్ సర్కిల్ సమీపంలోని మద్యం దుకాణంలో 8.4 లక్షలు స్వాహా చేసినట్లు గుర్తించారు. నలుగురినీ విచారించిన ఎక్సైజ్ అధికారులు వారి నుంచి డబ్బు రికవరీ చేసినట్లు కడప ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్ తెలిపారు. అయితే ఆలంఖాన్‌పల్లె, ఇర్కాన్ సర్కిల్ సమీపంలోని మద్యం దుకాణానికి సంబంధించి 16 వేలు రికవరీ కాకపోవడంతో ఆ దుకాణం సూపర్‌వైజరు నరసింహులు, సేల్స్‌మన్ వెంకటసుబ్బయ్యపై చెన్నూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఆయా సిబ్బందిని విధుల నుంచి తొలగించామన్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

నందలూరు, మార్చి 25: మండలంలోని కుందా నెల్లూరు గ్రామంలో రెండు గడ్డివాములు దగ్ధమైన సంఘటన సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గాదెన శివ నరహరి, గాదెన యల్లయ్యకు చెందిన రెండు గడ్డివాములలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఈ విషయాన్ని గమనించిన బాధితులు రాజంపేట ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేయగా హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకొని మంటలను ఆర్పారు. ఈలోపు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రెండు గడ్డివాములు అగ్నికి ఆహుతి అవ్వడం వల్ల రూ.70 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వారు కోరారు.

చెట్టుపై నుంచి పడి మహిళకు గాయాలు

కురబలకోట, మార్చి 25: చెట్టుపై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ నార్లపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి భార్య లక్ష్మిదేవమ్మ(56) గ్రామ సమీపంలోని తమ పొలంలో ఉన్న చింతచెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి తీవ్రంగా గాయపడింది. కుటుంబీకులు ఆమెను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్సల నిమిత్తం రుయాకు తరలించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

బి.కొత్తకోట, మార్చి 25: నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. బి.కొత్తకోట మండలంలోని గోళ్లపల్లి పంచాయతీ పరిధిలోని నల్లంకివారిపల్లి సమీపంలో నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లగా ఓ చెట్టు కింద అక్రమంగా సారా విక్రయిస్తున్న నల్లంకివారిపల్లికి చెందిన కె.సుబ్బన్న(63)తో పాటు, దిన్నిమీదపల్లెకు చెందిన ఎ.నాగార్జునరెడ్డి(32), టి.ఆనందరెడ్డి(43) లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి 24 లీటర్ల నాటుసారాను స్వాధీనంచేసుకున్నారు. నిందితులను తదుపరి చర్య నిమిత్తం రిమాండుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. మండలంలో సారా విక్రయాలు ఎక్కడ జరుగుతున్నా సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.

మైనర్లతో ఎన్నికల ప్రచారం చేయొద్దు

కడప (మారుతీనగర్) మార్చి 25: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీల నాయకులు తమ ప్రచారానికి 14 ఏళ్లలోపు చిన్నారులను ఉపయోగించరాదని ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చినట్లు కార్మికశాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించి చిన్నారులతో ప్రచారం చేయిస్తే సెక్షన్ 3 (1) ప్రకారం శిక్ష తప్పదని తెలిపారు.

వాహనాల తనిఖీల్లో రూ.1.20 లక్షలు స్వాధీనం

కురబలకోట, మార్చి 25: వాహనాల తనిఖీల్లో రూ.1.20 లక్షలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ సద్గురుడు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అంగళ్లులో జాతీయ రహదారిపై వాహనాలను పోలీసులు తనిఖీ నిర్వహించారు. కాగా పోలీసుల తనిఖీల్లో బెంగళూరు నుంచి కడపకు వెళుతున్న ఓ కారులో నగదు పట్టుబడింది. ఈ నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు లేకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతుకు గాయాలు

మదనపల్లె టౌన్, మార్చి 25: పొలం వద్ద స్టార్టర్ మరమ్మతులు చేస్తున్న రైతు విద్యుదాఘాతంతో గాయాలపాలయ్యాడు. చౌడేపల్లె మండలం కాటిపేరి గ్రామానికి చెందిన రైతు సుబ్రమణ్యం(65) సోమవారం తన పొలంలో నీరు కడుతుండగా బోరు స్టార్టర్ మరమ్మతు కావడంతో వెళ్లి స్టార్టర్ డోర్ తీశాడు. ఇంతలో పెద్దగా మంటలు రావడంతో పాటు సుబ్రమణ్యం విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

అంబరాన్ని తాకిన హోలీ సంబరాలు



హోలీ సంబరాల్లో బంజారా సంఘం నాయకులు

కడప (కల్చరల్) మార్చి 25: హోలీ సందర్భంగా సోమవారం బంజారా సంఘం నాయకులు ఈశ్వర్‌నాయక్, అంజినాయక్ ఆధ్వర్యంలో ఎ.ఆర్. కాలనీలో సంబరాలు నిర్వహించారు. అక్కడి సేవాలాల్ దేవాలయం పక్కనే ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి పిల్లలు, పెద్దలు, కుటుంబాలతో సహా హాజరై నృత్యాలు చేశారు. కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు హనుమంతనాయక్, శివనాయక్, అనిల్‌కుమార్‌నాయక్, జగన్‌నాయక్, ఆర్యనాయక్, బాలకృష్ణనాయక్, విక్రమ్ జగన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లలితా పరమేశ్వరి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న భక్తులు

కమలాపురం రూరల్, మార్చి 25 : నగర పంచాయతీ పరిధిలోని పాగేరు వంక ఒడ్డున ఉన్న లలితా పరమేశ్వరి ఆలయంలో సోమవారం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. సోమవారం ఉదయం అభిషేకాలు, హోమాలు, యంత్ర ప్రతిష్ఠ ప్రత్యేక పూజలు నిర్వహించారు కోగటం గ్రామానికి చెందిన తల్లపురెడ్డి సుధాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య రాజేశ్వరమ్మ, కుటుంబ సభ్యుల సహకారంతో ఈ ధ్వజస్తంభం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యుడు చెన్నకేశవస్వామి తెలిపారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ సేవకులు సుబ్బారెడ్డి, సుమంత్, సర్దార్, గంగా, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం



నరసింహస్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు

వీరపునాయునిపల్లె, మార్చి 25: మండలంలోని అనిమెల గ్రామం నరసింహస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా కల్యాణోత్సవం నిర్వహించా. సోమవారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, అనంతరం కళ్యాణతంతును నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలకు డప్పు వాయిద్యాల మధ్య భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అనాథాశ్రమంలో అన్నదానం



అనాథలకు అన్నదానం చేస్తున్న ఎద్దుల కొండ్రాయుడు

వేంపల్లె, మార్చి 25: వేంపల్లె నాగమ్మనగర్‌లోని మదర్ థెరిస్సా అనాథ శరణాలయంలో సోమవారం వృషభాచలేశ్వర దేవస్థాన మాజీ చైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు కుమారుడు కొండ్రాయుడు జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. పండ్లు పంచిపెట్టారు. కుటుంబ సభ్యులు, మిత్రులు పాల్గొన్నారు.

అర్చకులపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 25 : కాకినాడ శివాలయంలో అర్చకులుగా పనిచేస్తున్న సాయిశర్మ, విజయ్‌కుమార్‌శర్మపై దాడికి పాల్పడడం దుర్మార్గమని బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా మాజీ కోఆర్డినేటరు జనార్ధన్ ఒక ప్రకటనలో ఖండించారు. నిందితుడు, వైసీపీ మాజీ కార్పొరేటరు సిరియాల చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో బ్రాహ్మణ సామాజిక వర్గం వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు.

ఏపీలో టీడీపీ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఖాయం

- టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 25 : రాబోవు రోజుల్లో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని.. ప్రతి ఒక్కరూ టీడీపీ విజయం కోసం కృషి చేయాలని టీడీపీ కడప నియోజకవర్గ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి కోరారు. సోమవారం కడప నగరం 12వ డివిజన్ కృష్ణదేవరాయకాలనీలో టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమం, అభివృద్ధి పథకాలపై ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ సారథ్యంలో మాఫియా ప్రభుత్వం నడుస్తుందన్నారు. సంక్షేమ పథకాల పేరుతో తాయిలాలు ఇచ్చి నిలువుదోపిడీ చేశారని విమర్శించారు. రాష్ట్రంలో చంద్రబాబు సీఎం కావడం ఖాయమని తెలిపారు. ప్రజలందరూ ఒక్కసారి టీడీపీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ కార్పొరేటరు రాజగోపాల్‌రెడ్డి, నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జయరాం పెద్దసంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో మాధవీరెడ్డి

వైసీపీ కోవర్టు డ్వామా పీడీ

- అవినీతిపై న్యాయవిచారణ జరపాలి
- టీడీపీ నేత హరిప్రసాద్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 25 : డ్వామా పీడీ వైసీపీ కోవర్టుగా వ్యవహరిస్తున్నాడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్ ఆరోపించారు. ఎన్నికల కోడ్‌ను డోంట్ కేర్‌గా వ్యవహరిస్తున్న ఆయనపై న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం హరిటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డ్వామా పీడీ వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నాడన్నారు. పాత తేదీలు వేసి ఉద్యోగులను బదిలీ చేశాడని విమర్శించారు. కలెక్టరు స్పందించి పీడీపై చర్యలు తీసుకోవాలని కోరారు. డ్వామా పీడీ ఎన్నికల కోడ్‌ను పాటించకపోగా వైసీపీ కోవర్టుగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. కడపలో త్రీస్టార్ పోలీసు ఉద్యోగి కనుసన్నల్లో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్నారు. అశోక్‌రెడ్డిని ఎన్నికలకు దూరంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. దోచుకో, దాచుకో అన్న చందంగా అశోక్‌రెడ్డి వ్యవహార శైలి ఉందన్నారు. ఎన్నికల కమిషన్ అశోక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు సీఐపై ఫిర్యాదు చేశామన్నారు. కడపలో కేసినో, క్రికెట్ బెట్టింగ్‌లు పెరిగిపోయాయని వాపోయారు. ఒక్క సీఐతో ఎస్‌ఐలకు చెడ్డపేరు వస్తోందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పీరయ్య, జనార్ధన్, నాగరాజు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

నిబంధనల మేరకే బదిలీలు : డ్వామా పీడీ

డ్వామా కార్యాలయంలో ప్రభుత్వ నిబంధనల మేరకే బదిలీలు చేశామని డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించలేదన్నారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'డ్వామాలో డ్రామా..' అనే కథనంపై ఆయన స్పందిస్తూ... డ్వామా కార్యాలయంలో ప్రభుత్వం నిబంధనల మేరకే బదిలీలు చేశామని, ఇందులో ఎటువంటి రాజకీయ ప్రమేయం లేదని స్పష్టం చేశారు. ఎన్నికల నియామవళిని ఉల్లంఘించలేదని పేర్కొన్నారు.

'రాష్ట్రాన్ని డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చిన జగన్'

కడప (ఎడ్యుకేషన్), మార్చి 25 : ఆంధ్రరాష్ట్రాన్ని సీఎం జగన్‌రెడ్డి డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చినట్లు టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్ తెలిపారు. సోమవారం కడప నగరం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైన వైసీపీ ప్రభుత్వం వారి జీవితాలను నాశనం చేసే డ్రగ్స్ , గంజాయి, మద్యం మాదక ద్రవ్యాలను అరికట్టలేకపోయిందని విమర్శించారు. రాష్ట్రం, దేశం అబివృద్ధి చెందాలంటే విద్యార్థులు, యువత చాలా కీలకం. అటువంటి విద్యార్థి యువతకు నాశనం చేసే డ్రగ్స్, గంజాయి, మద్యం సప్లై చేస్తూ వారి జీవితాలు నాశనం చేస్తున్నారని ఆరోపించారు. పెద్దపెద్ద నగరాల్లో దొరికే గంజాయి, డ్రగ్స్ ఇప్పుడు పల్లెపల్లెకూ, కళాశాలకు, పాఠశాలలకు విస్తరింపజేశారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో ఏపీ మొదటి స్థానంలో ఉంటే నేడు గంజాయి అక్రమరవాణాలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. గతంలో గుజరాత్, ముంద్రా పోర్టులో ఆఫ్ఘనిస్తాన్ నుంచి ఇరాన్ ద్వారా బెజవాడలోని ఆర్‌టీ ట్రేడింగ్ కంపెనీ పేరుతో రవాణా చేస్తున్న 72వేల కోట్ల హెరాయిన్ పట్టుబడిందని, ఇప్పుడు బ్రెజిల్ నుంచి వైజాగ్ పోర్టులో 50వేల కోట్ల విలువ గల డ్రగ్స్ దొరికాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గంజాయి సరఫరా చేస్తున్న వారికి అండగా ఉండే నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మనోజ్, అనిల్, లోకేశ్, బాషా, సాయిక్రిష్ణ, మహేష్, శ్రీను పాల్గొన్నారు.

మల్లూరమ్మ తిరుణాల మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో మల్లూరమ్మ మూలవిరాట్

చిన్నమండెం, మార్చి 25: మండలంలోని కొత్తపల్లి మల్లూరు గ్రామ పంచాయతీలో మాండవ్యనది ఒడ్డున వెలసిన మల్లూరమ్మ తిరుణాల మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని అలంకరించారు. సోమవారం నిండు తిరుణాల, మంగళవారం మైల తిరుణాల, చెక్కభజనలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేషధారణలు, డప్పు వాయిద్యాల మధ్య ఘనంగా నిర్వహించారు. వచ్చే భక్తుల కోసం మానవతా స్వచ్ఛంద సంస్థ వారు తిరుణాలలో భక్తుల కోసం మజ్జిగ, మంచినీటి సదుపాయం కల్పించారు. తిరుణాలకు ముగ్గురు సీఐలు, ఐదుగురు ఎస్‌ఐలు, 100 మంది పోలీసు సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ రమేశ్‌బాబు తెలిపారు. తిరుణాలకు వచ్చే భక్తుల కోసం పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశామని, దాదాపు 20 చాందినీ బండ్లు జాతరకు కదుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీరభద్రాలయంలో ఘనంగా పల్లకి ఉత్సవం

వీరభద్రాలయంలో పల్లకి ఉత్సవంలో భక్తులు



రాయచోటిటౌన్, మార్చి 25: దక్షిణకాశీగా పేరుగాంచిన పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో రమణారెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడు ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పల్లకీ ఉత్సవంపై ఆలయం చుట్టూ మాడవీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చకస్వాములు ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందించారు.

వాడవాడలా ఘనంగా హోలీ వేడుకలు



రాజంపేటలో హోలీ వేడుకల్లో యువత..

నందలూరులో..



రాజంపేటటౌన్, మార్చి 25: రాజంపేట పట్టణంలో సోమవారం ఘనంగా హోలీ వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని యువత వీధుల్లోకి వచ్చిన రంగులు చల్లుకుంటూ, రంగునీళ్ల చల్లుకుంటూ ఈలలు, కేకలు, కేరింతల మధ్య పెద్దఎత్తున హోలీ వేడుకలు జరుపుకున్నారు. ఒకరికొకరు రంగులు పూసుకుంటూ చిన్నపెద్ద తేడా లేకుండా అందరూ ఈ వేడుకల్లో పాల్గొని ఆనందోత్సాహాల మధ్య ఈ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

రైల్వేకోడూరు: పట్టణంలో హోలి పండుగను మార్వాడీలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో ఉన్న రాజస్థాన్ తదితర రాష్ట్రాలకు చెందిన మార్వాడీలు రంగులు చల్లుకుని ఆలింగనం చేసుకున్నారు. ప్రతి మర్వాడీ ఇంటిలో ప్రత్యేక పూజలు చేశారు. కొత్త దుస్తులు ధరించి హోలి సంబరాలు జరుపుకున్నారు.

నందలూరు: నందలూరు రైల్వే కేంద్రంలో రైల్వే కార్మికులు సోమవారం ఉదయం ఘనంగా హోలీ సంబరాలు నిర్వహించుకున్నారు. ఒకరినొకరు రంగులు పూసుకుంటూ, నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పండగ చేసుకున్నారు. ముఖ్యంగా ఉత్తర భారతదేశానికి చెందిన ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ కార్మికులు ఈ వేడుకలు నిర్వహించుకున్నారు. మహిళలు ఉదయాన్నే లేచి వివిధ రకాల పిండి వంటలు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి పండుగ చేసుకున్నారు. పిల్లలు సైతం రంగులు చల్లుకున్నారు.

బీజేపీలోకి ... బొజ్జా రోశన్న!

కడప(మారుతీనగర్) మార్చి 25: నరేంద్రమోదీ పాలనలోనే మన దేశం సర్వతోముఖాభివృద్ధి దిశగా సాగుతున్నదని బద్వేల్ నియోజకవర నేత బొజ్జా రోశన్న తెలిపారు. ఆయన ఆశయాలు నచ్చి భారతీయ జనతా పార్టీ తీర్థం పుచ్చుకున్నట్లు వెల్లడించారు. సోమవారం స్థానిక ఎన్‌జీవో కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి సమక్షంలో రోశన్న బీజేపీ కండువా ధరించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా కుంటుపడిన బద్వేల్ నియోజకవర్గ అభివృద్ధిని గాడిలో పెట్టేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. బద్వేల్- కృష్ణపట్నం జాతీయ రహదారిని కేంద్రప్రభుత్వ సహకారంతో పూర్తి చేసేందుకు శ్రమిస్తానన్నారు. ముఖ్యంగా బద్వేల్ నియోజకవర్గంలో చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో పాలక ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందన్నారు. కేంద్రం సహకారంతో ఉపాధి అవకాశాలను కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆయనతో పాటుగా బి.కోడూరు టీడీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, వందమందికి పైగా కార్యకర్తలు, బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, బీజేపీ సీనియర్ నాయకులు వి.వి. చలపతి, నాయకులు సుబ్బారెడ్డితో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.



బీజేపీ కండువా ధరిస్తున్న రోశన్న

సీఏఏ, ఎన్ఆర్‌సీపై వైసీపీ ముసుగు తీయాలి



విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ జిలానీబాషా

కడప (ఎడ్యుకేషన్), మార్చి 25 : సీఏఏ, ఎన్ఆర్‌సీ విషయంలో వైసీపీ నాయకులు ముసుగు తీయాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జిలానీబాషా కోరారు. సోమవారం కడప నగరం ద్వారకనగర్ టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లుగా అధికారంలో ఉన్న వైసీపీ నాయకులు, తాము చేసింది చెప్పుకోవడానికి ఏమీ లేక, తమ అసమర్థతను కప్పి పుచ్చుకోవడానికి, సీఏఏ పేరుతో రాజకీయ లబ్ధి పొందేందుకు టీడీపీ కడప అభ్యర్థి మాధవీరెడ్డిపై బురద చల్లుతున్నారన్నారు. ముస్లిం సమాజం విజ్ఞత కలిగిన సమాజమని, ఇలాంటి కుటిల రాజకీయాలకు ఎన్నికల్లో తగిన జవాబు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. దేశంలోనే మొదటి ఉర్దూ యూనివర్సిటీ, ముస్లిం వెల్ఫేర్ కార్పొరేషన్, హైదరాబాదు, కడపలో హజ్‌హౌస్‌లు ఏర్పాటు చేసిన ఘనత టీడీపీదేనన్నారు. ఇంత వరకు పార్లమెంటు ఉభయసభల్లో ముస్లింలకు ప్రాతినిధ్యం కల్పించని వైసీపీకి ముస్లింల ఓటు అడిగే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.

'చేనేత'ల ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న జయవర్ధన్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 25 : చేనేత కుటుంబం ఆత్మహత్యకు కారణమైన రెవెన్యూ అధికారులను వెంటనే అరెస్టు చేయాలని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, న్యూ డెమోక్రసీ జిల్లా కన్వీనరు అంకన్న డిమాండ్ చేశారు. ఈ ఉదంతంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని కోరారు. సోమవారం కడప నగరం ఓంశాంతినగర్ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కడప జిల్లా కొత్తమాధవరంలోని చేనేత కార్మికులు సుబ్బారావు, అతని భార్య కూతురు రెవెన్యూ అధికారుల వేధింపులు, వైసీపీ నాయకుల అరాచకాల కారణంగా ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆత్మహత్యకు గల కారణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని రెవెన్యూ అధికా రులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. 3.10 ఎకరాల భూమిని వైసీపీ నాయకులు దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నట్లు సూసైడ్ నోట్‌లో సుబ్బారావు తెలిపాడన్నారు. వైసీపీ దుర్మార్గానికి అంతం లేకుండాపోయిందని, ఇప్పటికైనా చేనేత కుటుంబం ఆత్మహత్యపై వెంటనే విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు శ్రీను, గంగులయ్య పాల్గొన్నారు.

సుబ్బారావు కుటుంబానికి అండగా ఉంటాం



సుబ్బారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న పద్మశాలీయులు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 25 : సుబ్బారావు కుటుంబానికి అండగా ఉంటామని పద్మశాలీయ కుల సంఘం సభ్యులు తెలిపారు. సోమవారం మాధవరంలో సుబ్బారావు కుటుంబ సభ్యులను పద్మశాలీయ కుల సంఘం సభ్యులు పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆ కుటుంబానికి జరిగిన నష్టం పూడ్చలేనిదన్నారు. దీనికి కారకులైన వారిపై తగిన చర్యలు తీసుకో వాలని కలెక్టరును కలిసి వినతిపత్రం ఇవ్వాలని కులసంఘం నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు, కుల ప్రతినిధులు పాల్గొన్నారు.

మైనార్టీలు కాంగ్రెస్ వెంటే : తులసిరెడ్డి

వేంపల్లె, మార్చి 25: ముస్లిం మైనార్టీలు కాంగ్రెస్ వెంటే ఉన్నారని పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. వేంపల్లె, పెండ్లిమర్రి మండలాలకు చెందిన మైనార్టీ అధ్యక్షుల నియామక పత్రాలను సోమవారం వారికి అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రచార సీడీలను ఆవిష్కరించారు. పెండ్లిమర్రి మండల శాఖ కాంగ్రెస్ అధ్యక్షునిగా షేక్ మహబూబ్ బాషకు (మాస్), వేంపల్లె మండల మైనారిటీ సెల్ చైర్మన్‌గా మదార్ బాషకు తులసిరెడ్డి నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చిల్లీస్ ప్యూర్ వెజ్ రెస్టారెంట్ ప్రారంభం



చిల్లీస్ రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి, మేయర్ తదితరులు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 25 : నగరంలోని డీసీసీ బ్యాంకు ఎదురుగా సోమవారం ఉదయం చిల్లీస్ ప్యూర్ వెజ్ రెస్టారెంట్‌ను ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా, నగర మేయరు సురేష్ బాబు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ రెడ్డి మాట్లాడుతూ పూర్తి శాఖాహార హోటల్‌ను కడప ప్రజలకు అందిస్తున్నందుకు యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డప్పగారి మాధవీరెడ్డి విచ్చేశారు. రెస్టారెంట్ యజమానులు హర్ష, అంజి మాట్లాడుతూ సువిశాలమైన పార్కింగ్ సదుపాయం, ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్యూర్ వెజ్ శాఖను ప్రారంభించినట్లు తెలిపారు. మా చిల్లీస్ రెస్టారెంట్‌ను ఆదరిస్తున్న జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లా మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27న కంటి వైద్యశిబిరం

కమలాపురం రూరల్, మార్చి 25 : ఈ నెల 27న కమలాపురం పట్టణంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నామని మదర్‌థెరిసా సేవా సమితి ట్రస్టు చైర్మన్ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కమలాపురం నగర పంచాయతీ ప్రజలకు కంటి పరీక్షల కోసం బ్యాక్వర్డ్ కమ్యూనిటీ డెవలప్‌మెంటు సొసైటీ (బీసీడీఎస్) మరియు మదర్‌థెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూలులో బుధవారం ఉదయం 9గంలకు ఈ శిబిరంనిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభిలాష్ నేత్ర వైద్యశాలకు చెందిన డాక్టర్ ఎస్.గురుమూర్తి, గురు అభిలాష్ రోగులను పరీక్షించి మందులు , కంటి అద్దాలు పంపిణీ చేస్తారన్నారు.

భద్రత ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

వేంపల్లె, మార్చి 25: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 27వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇడుపులపాయ నుంచి నిర్వహిస్తున్న బస్సు యాత్రకు సంబంధించిన భద్రత ఏర్పాట్లను ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సోమవారం పరిశీలించారు. ఇడుపులపాయలోని వైఎస్సార్ గెస్ట్‌హౌస్‌ను, ఘాట్‌ను సందర్శించారు. హెలి ప్యాడ్ స్థలం, ప్రార్థన చేసే ప్రాంతం పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. అక్కడ నుంచి బస్సు యాత్ర సాగే వీరన్నగట్టుపల్లె, వేంపల్లె, హనుమాన్ జంక్షన్ ప్రాంతాలను ఎస్పీ పరిశీలించి కిందిస్థాయి పోలీసులకు తగు సూచనలిచ్చారు.

సీఎం బస్సు యాత్ర ఏర్పాట్లలో తాత్కాలిక ఉద్యోగి



సీఎం బస్సుయాత్ర ఏర్పాట్లలో తాత్కాలిక ఉద్యోగి రాజ్‌కుమార్

కడప, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార బస్సు యాత్ర ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళ్లిన వైసీపీ నేతలతో కలిసి తాత్కాలిక ఉద్యోగి పాల్గొన్నారని టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి తెలిపారు. స్థానిక రాజారెడ్డి నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్న బత్తల రాజ్‌కుమార్ సోమవారం ఇడుపులపాయలో ఎంపీ అవినాశ్‌రెడ్డి, రఘురామ్, ఇతర నేతలు పాల్గొన్న ఏర్పాట్ల కార్యక్రమంలో ఉన్నారని ఈ విషయం ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశామని అన్నారు. ఇది ఎన్నికల నియమావళికి విరుద్ధమన్నారు. కాగా విధుల్లో భాగంగా ఇడుపులపాయకు వెళ్లానని ఆ కార్యక్రమంతో సంబంధం లేదని రాజ్‌కుమార్ అధికారులకు తెలియజేశారు.

అయ్యప్పస్వామికి పూజలు

పోరుమామిళ్ల, మార్చి 25 : అయ్యప్పస్వామి జన్మ దినం సందర్భంగా భక్తు లు ప్రత్యేక పూజలు చేశా రు. సోమవారం పోరు మా మిళ్లలోని వేణు గోపాలస్వామి ఆలయం లో వెలసిన అయ్యప్ప స్వామి దేవాలయంలో పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం వేద మంత్రాలతో పూజ కార్యక్రమాలు చేశారు. అయ్యప్పస్వాములు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అయ్యప్పస్వామి భక్తులు శ్రీధర్, రంగనాయకులు, గుర్విరెడ్డి, ప్రగతి శ్రీనివాస్, మధు, భరత్, సునీల్, డిస్కో రమణ, బండారు శ్రీను, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వికలాంగుల ఇళ్ల స్థలాలకు మద్దతుగా అఖిలపక్ష నాయకులు

బద్వేలు, మార్చి 25: బద్వేలు పట్టణంలో 941 సర్వేనెంబరులో ఇల్లు లేని నిరుపేదలైన వికలాంగులు గుడిసెలు ఏర్పాటు చేసుకుంటే పోలీసు అధికారులు వారి గుడిసెలు కూల్చివేయడం దారుణమని వికలాంగులకు న్యాయం జరిగేంతవరకు వారికి అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ పీసీసీ కార్యదర్శి ప్రభాకర్, సీపీఐ జిల్లా జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్, దళిత సీనియర్ నాయకుడు జకరయ్య పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 941 సర్వేనంబరులో గుడిసెలు వేసుకున్న స్థలాలను వారు పరిశీలించారు. అధికారులు స్పందించి వికలాంగులకు న్యాయం చేయాలన్నారు. వికలాంగులకు మద్దతుగా ప్రజా సంఘాలు అండగా ఉండడమే కాకుండా ప్రత్యక్ష ఉద్యమాలలో పాల్గొంటామన్నారు. వికలాంగులకు టిడ్కోకు కేటాయించిన స్థలంలో పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి నాయకులు కేశవ, ఎమ్మార్పీఎస్ నాయకులు శిఖామణి, వికలాంగుల సంఘం నాయకులు మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి ... బొజ్జా రోశన్న!



కండువా కప్పుకుంటున్న రోశన్న

కడప (మారుతీనగర్) మార్చి 25: నరేంద్ర మోదీ పాలనలోనే మన దేశం సర్వతో ముఖాభివృద్ధి దిశగా సాగుతున్నదని బద్వేల్ నియోజకవర్గ నేత బొజ్జా రోశన్న తెలిపారు. ఆయన ఆశయాలు నచ్చి బీజేపీ తీర్థం పుచ్చుకు న్నట్లు వెల్లడించారు. సోమవారం స్థానిక ఎన్‌జీవో కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి సమక్షంలో రోశన్న బీజేపీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో బి.కోడూరు టీడీపీ నాయకులు రామ సుబ్బారెడ్డి,వందమందికి పైగా కార్యకర్తలు, బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, వి.వి. చలపతి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

ప్రొద్దుటూరు, మార్చి 25 : ఒక్కసారి అవకాశమిచ్చినందుకు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌ను ప్రజలు గద్దె దింపడానికి సిద్ధంగా వున్నారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం గోపవరం పంచాయతీ ద్వారాకానగర్‌లో ఇరగంరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీనుంచి 150 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి వరదరాజులరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఇరగంరెడ్డి గోపిరెడ్డి, శేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఓబులరెడ్డి, సూర్యనారాయణరెడ్డి రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాదం పంపిణీ



ప్రొద్దుటూరు టౌన్, మార్చి 25: పౌర్ణమి సందర్భంగా కొర్రపాడు రోడ్డులోని మున్సిపల్ పెట్రోలు బంకు వద్ద కాళభైరవస్వామి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నప్రసాద వినియోగం చేశారు. సోమవారం రాజేశ్వరి, ప్రభాకర్, మౌనిక, శ్రావణ్‌కుమార్ సహకారంతో భక్తులకు అన్నప్రసాదం వినియోగం చేసినట్లు ట్రస్టు అధ్యక్షుడు శ్రీనివాసుల స్వామి తెలిపారు. ఈ సందర్భంగా రామేశ్వరంలోని కాలభైరవస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివ, భరత్, నీరజ్, ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంకాలమ్మ తిరుణాల

బి.కోడూరు, మార్చి 25 : మండల పరిధిలోని మున్నెల్లిగ్రామంలో వెలసిన పురాతన అంకాలమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి తిరుణాల ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి బాణసంచా, భజంత్రీల నడుమ నూనె డబ్బాలు, అలాగే కోలాటాలు, చెక్కభజనలు, సాంస్కృతిక కార్యక్ర మాలు ఘనంగా నిర్వహించారు. అక్కడికి వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తిరుణాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బి.కోడూరు ఎస్ఐ జయరాములు తన సిబ్బందితో గటి బందోబస్తు నిర్వహించారు.

28 నుంచి ఉచితంగా పాలిసెట్ కోచింగ్

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 25: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష కోసం ఈనెల 28 నుంచి ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు జేవీవీ అధ్యక్షుడు డాక్టర్ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీత తెలిపారు. సోమవారం జేవీవీ కార్యాలయంలో ఉచిత కోచింగ్ పోస్టర్లను ఆవిష్కరించారు. నందినీ క్లాత్‌మార్కెట్‌లోని జేవీవీ కార్యాలయంలో ఉచిత కోచింగ్ శిక్షణ ఉంటుందన్నారు. 9398722704 నంబరులో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఏమి చేశావని మేము సంసిద్ధం అనాలి

జగన్ ప్రొద్దుటూరు పర్యటనపై వరదరాజులరెడ్డి విమర్శ



ప్రొద్దుటూరు , మార్చి 25 : ఏమి చేశావని ప్రొద్దుటూరు ప్రజలు మేము సంసిద్ధం అనాలో జగన్ తెలపాలని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి విమర్శిం చారు. సోమవారం నెహ్రూరోడ్డులోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం సీఎం జగన్‌వచ్చి ప్రొద్దుటూరులో 516 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు శిలాఫలాకాలేశారన్నారు. అందులో ఏ ఒక్క అభివృద్ధి పథకం పూర్తయింటే ప్రజలకు తెలియజెప్పాలన్నారు. కనీసం ఆ పనులకు జరిగిన బిల్లులు కూడా ఇవ్వని దుస్థితిలో జగన్‌ప్రభుత్వం ఉందన్నారు. వైసీపీనేతల ఇసుక దందాకోసం అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకు పోయేలా చేస్తే కనీసం అక్కడ నిర్వాసితులకు ఇప్పటికీ ఒక్క ఇల్లు కట్టివ్వలేదన్నారు. రెండేళ్ళు దాటినా ఆ ప్రాజెక్టుకు కనీసం ఇప్పటి వరకు పైసా నిధులు కేటాయించి పునః నిర్మాణ పనులు చేపట్టలేదన్నారు. గ్రామ పంచాయతీలోని నిధులు కేంద్ర గ్రాంట్‌లను వాడుకోని పంచాయతీల్లో కనీసం చీపురులు కొనడానికి కూడా డబ్బులు లేకుండా చేశావన్నారు. ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే అడ్డంగా దోచుకోవడానికి అధికారం మిచ్చినందుకు ప్రజలను మళ్ళీ వంచించడాని వస్తున్నావో తెలపాలని కోరారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ ఎంపీపీలు రాఘవరెడ్డి, లక్ష్మీపేట గురివిరెడ్డి, మాజీ కౌన్సిలర్ తాటి శ్రీనివాసుల యాదవ్, జనసేననాయకులు నుంకర మురళి పాల్గొన్నారు.

ఐదేళ్లలో అభివృద్ధి ఏం చేశావో పేపర్ మీద పెట్టు

పాతికేళ్లలో మేమేం చేశామో ప్రకటిస్తాం: రాచమల్లుకు కొండారెడ్డి సవాల్



ప్రొద్దుటూరు , మార్చి 25 : ఐదేళ్ల పాలనలో అభివృద్ధి ఏం చేశావో పేపర్ మీద పెట్టు.. పాతికేళ్లలో మేమేం చేశామో మేమూ ప్రకటిస్తామంటూ ఎమ్మెల్యే రాచమల్లుకు టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి సవాల్ విసిరారు. సోమవారం స్థానిక నెహ్రూ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు వైసీసీ ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ప్రొద్దుటూరులో ఏమాత్రం అభివృద్ధి చేశారో తెలిపితే గతంలో మేము చేసిన అభివృద్ధినీ పేపర్‌మీద పెట్టి విడుదల చేస్తామన్నారు. అప్పుడు ప్రజలు ఎవరికి ఓటేయ్యాలో నిర్ణయించుకుంటారన్నారు. అంతేగాని ఎలాంటి మాటలు, విమర్శలు అక్కరలేదని అంతా పేపర్‌పై పెట్టి విడుదల చేయాలన్నారు. ఏపీకి విశాఖను రాజధానిగా చేస్తానన్న జగన్ డ్రగ్స్ కేంద్రంగా మార్చాడని పేర్కొన్నారు. విశాఖలో వేల కోట్ల రూపాయల డ్రగ్స్ కంటైనర్ పట్టుబడిందన్నారు. దీన్ని సీబీఐ వాళ్ళు పట్టుకోవడానికి ప్రయత్నిస్తే దానిని నాలుగు రోజులు పట్టుకోకుండా రాష్ట్ర పోలీసులు నిలువరించారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వానికి సంబంధం లేకుంటే రాష్ట్ర పోలీసులు ఎందుకు అడ్డుకున్నారన్నారు. వీరభద్రరావు పూర్ణ చంద్రరావు వైసీపీ మద్దతుగా పోస్టర్లు వేశారన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు కూడా 50 లక్షలు విరాళాలు ఇచ్చారన్నారు. ఈయన ఈ మాఫియాలో కీలక పాత్ర దారి .ఈయనకు విజయసాయిరెడ్డికి సంబంధాలువన్నాయని ఫొటోలు తెలుపుతున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దొంగే దొంగా.. దొంగ అని అరుస్తారన్నారు. రాబోయే ఎన్నికల్లో డబ్బు జబ్బుపట్టిరాష్ట్రాన్ని మత్తు ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన జగన్ను ఓడించాలని పిలుపునిచ్చారు.

ఘనంగా గౌరపౌర్ణమి వేడుకలు



పుష్పాభిషేకం చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 25: గౌరవ పౌర్ణమి వేడుకలను ఇస్కాన్ ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో శ్రీకృష్ణ బలరామ విగ్రహాలను ఆశీనులను చేసి పూజలు నిర్వహించారు. విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భగవద్గీత ప్రవచనాలు చేశారు. 8.30 గంటలకు మహాహారతి నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. భక్తులు స్వామివారిని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు.

చేతిరాత నిపుణుడికి అవార్డు ప్రదానం

పోరుమామిళ్ల, మార్చి 25 : కలసపాడు మండలం మామిళ్లపల్లె గ్రామానికి చెందిన మన్యం మల్లేశ్వర్‌రెడ్డి జాతీయ స్థాయి ఉత్తమ గురుదేవో అవార్డు అందుకున్నారు. సోమవారం గుంటూరులోని పెన్షనర్స్ భవన్‌లో జాతీయ స్థాయి ఒలంపియాడ్ అయిదో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలిండియా హ్యాండ్ రైటింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అక్షరహ్యాండ్ రైటింగ్ అకాడమీ డైరెక్టరు మల్లేశ్వర్‌రెడ్డి ఈ అవార్డునందుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రకృతి వనం ఫౌండర్ ఎంసీవీ ప్రసాద్, రిటైర్డ్ డీఐజీ ఏఎస్‌ఖాన్, గైనకాలజిస్ట్ డాక్టర్ సామా సుల్తానా, ఒలంపియాడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు లక్ష్మణరావు చేతుల మీదుగా ఈ అవార్డు, మెమెంటో అందుకున్నారు.

అన్నదానం

కొండాపురం, మార్చి 25: మండలంలోని చౌటిపల్లెలో కాశిరెడ్డినాయన ఆలయంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని గణపతి, అన్నపూర్ణేశ్వరి, కాశిరెడ్డినాయన విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మురుగు కాలువ పూడికతీయరా..?



మురుగు కాలువ పూడికతో నిండిపోవడంతో రోడ్డు పై ప్రవహిస్తున్న నీరు

బద్వేలు రూరల్, మార్చి 25: బద్వేలు మునిసిపాలిటీలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. అభివృద్ధి పనుల్లో భాగంగా అక్కడో ఇక్కడో సిమెంటు రోడ్లు వేశారు. కానీ మురుగు కాల్వల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఏటా రెండు దఫాలు పన్నులు వసూలు చేస్తున్న మున్సిపాలిటీలో పూడికతీత తీయని మురుగు కాల్వలు రోడ్డుపైనే ప్రవహిస్తూ మురుగునీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పాలకులు అధికారులకు పట్టనట్లు లేదు.

మురుగు ప్రవహించని ప్రాంతాలు..: మున్సిపల్ పరిధిలోని శివానగర్ మొదలు అన్ని ప్రాంతలా నుంచి ప్రవహించే మురుగునీరు స్థానిక ఆర్టీసీ బస్టాండు వెనుక వైపు నుంచి గ్యారేజీలోని పెద్దకాల్వ గుండా టీబీ సాహెబ్ కుంటలో చేరాలి. అయితే ఆర్టీసీ బస్టాండు వెనుక మురుగుకాల్వ పూర్తి కాకపోవడంతో ఆ ప్రాంతమంతా మురుగునీటితోనే నిండిపోయింది. స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని అశోక్‌నగర్, చాపలవీధి తదితర ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు రూపరాంపేటలోని పెద్దకాల్వ గుండా నాగులచెరువులోకి చేరాల్సి ఉంది. అయితే రూపరాంపేట సమీపంలో కాల్వ పూడిక తీయకపోవడంతో మురుగునీరు ప్రవాహం పూర్తి ఆగిపోయి ఆ ప్రాంతంలో మురుగునీరు రోడ్డుపైనే నిలుస్తోంది. అలాగే దోమలు ప్రబలి అంటువ్యాధులకు దారి తీస్తుందని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు..: రూపరాంపేటలో పూడిక తీయకపోవడంతో మురుగునీటి ప్రవాహం ఆగిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నివాస ప్రాంతాల వారు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూడికతీత తీసి మురుగు ప్రవాహాన్ని క్రమబద్ధీకరణ చేస్తే మురుగునీరు నిల్వకుండా నాగులచెరవులో చేరుతుందని సంబంధిత అధికారికి చెప్పినా గత పదిరోజులుగా పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా మురుగునీటి ప్రవాహం సక్రమంగా ప్రవహించేటట్లు చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

రోడ్డు దారుణం



జమ్మలమడుగు, మార్చి 25: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని నారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ప్రధాన రోడ్డుపై గుంతలు పడి అసౌకర్యంగా ఉంది. గత ఏడాది నుంచి సమస్య ఉన్నా అధికారులు పరిష్కరించలేదని స్థానికులు వాపోతున్నారు. మే నెలలో నారాపురం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, ఇప్పటికైనా రోడ్డు గుంతలు పూడ్చాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కుళాయిలకు కలుషితనీరు రాకుండా చూడాలి

జమ్మలమడుగు, మార్చి 25: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో పలు వీధుల్లో రంగుమారిన నీళ్ల (కలుషిత నీరు) సరఫరా చేస్తున్నారని డీవైఎఫ్ఐ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. చాలా రోజుల నుంచి మురుగు నీరు తాగునీటి కుళాయిల్లో సరఫరా అవుతున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు రంగునీళ్ల సరఫరా కాకుండా చూడాలని ఆయన తెలిపారు.

ఘనంగా అమరేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

కొండాపురం, మార్చి 25: మండలకేంద్రమైన కొండాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో అమరేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు.అమరేశ్వర స్వామితో పాటు, భవాని, గణపతి, నందీశ్వర,ధ్వజస్తంభం,శిఖర కలశ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా చెక్కభజన అన్నదానం, రాత్రికి భజన కార్యక్రమం నిర్వహించారు.

మందకృష్ణ, చంద్రబాబును కలసిన వెంకటేష్



మైదుకూరు, మార్చి 25 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ, చంద్రబాబును ఉమ్మడి కడప జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మానికింద వెంకటేష్ మాదిగ కలిసి జిల్లాలో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఆదివారం ఆయన ఉండవల్లిలో వారితో మాట్లాడారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు జిల్లాలో టీడీపీకి మద్దతు ఇస్తున్నామని, వైసీపీ మాదిగలకు చేసిన నష్టాలను వివరిస్తూ టీడీపీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు వెంకటేష్ సోమవారం మైదుకూరులో విలేకరులకు తెలిపారు.

రేపు నూతన విగ్రహ ప్రతిష్ఠ

బద్వేలు రూరల్, మార్చి 25 : స్థానిక శ్రీకృష్ణదేవరాయనగర్, త్యాగరాజకాలనీలో ఉండే కాశీ విశ్వేశ్వరస్వామి స్ఫటిక శివాలయంలో కాలభైరవ సహిత మేధా దక్షిణామూర్తి నూతన విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షిక మహోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రామోత్సవం తదిత ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మజ్జిగ పంపిణీ



ప్రొద్దుటూరు, మార్చి 25 : వేసవి దాహం తీర్చడం ఎంతో పుణ్యమని చల్లని మజ్జిగ తో శరీర ఆరోగ్యం ఎంతో పదిలమని మెగా స్టార్ చిరంజీవి యువత అధ్యక్షుడు అక్కిదాసరి రామారావు పేర్కొన్నారు. సోమవారం శివాలయం సెంటర్‌లో రామచరణ్ జన్మదిన వారోత్సవాల సందర్భంగా మెగాస్టార్ అభిమానులు ప్రజలకు మజ్జిక పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెగా స్టార్ అభిమానులు షరీఫ్, మధు , చిరు రాయల్, బాబూ రావు, చిన్న , పల్లా రఘు, వేణు, రాము, ఇమామ్, శంకర్ సుబ్బయ్య పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడికి గాయాలు

కాశినాయన మార్చి25: మండలంలోని మిద్దెల ఎస్సీకాలనీకి చెందిన ఎర్రబల్లె మద్దెయ్య కుమారుడు చిన్నబాబును సోమవారం కారు ఢీకొని తీవ్రగాయాలయ్యాయి. కాలనీకి చెందిన కొంతమంది యువకులు కాలినడకన జ్యోతిమీదుగా అహోబిలం తిరుణాలకు వెళ్లారు. సోమవారం తిరుగు ప్రయాణంలో దిగువ అహోబిళంలో దారివెంట నడి చి వస్తుండగా చినబాబును ఎదురుగా వస్తున్న కారుఢీకొట్టింది. దీంతో చినబాబు తలకు,పొట్టకు, తీవ్రగాయాలయ్యాయి. గుర్తించిన సహచరులు ఆళ్ళగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

గోపవరం, మార్చి 25 : అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్‌డీ విజయజ్యోతి పేర్కొన్నారు. సోమవారం గోపవరం మండలంలోని వివిధ పంచాయతీల నాయకులతో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలని హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి జకరయ్య, రామచంద్రారెడ్డి, సాంబయ్య, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి బలైన చేనేత కుటుంబం

మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పించిన నేతలు





మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కల్యాణి, చేనేత కుటుంబం ఆత్మహత్యపై నివాళులర్పిస్తున్న బీసీ నేతలు

ప్రొద్దుటూరు, మార్చి 25 : వైసీపీ ప్రభుత్వంలో భూకబ్జాదారుల దాష్టీకానికి రాష్ట్రం లో చేనేత కుటుంబం బలైందని బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆశ్రమంవీధిలోని బీసీ సమాఖ్య కార్యాలయం వద్ద ఒంటిమిట్ట మాధవరంలో వైసీపీ పాలనకు బలైన చేనేతలైన పాలసుబ్బారావు కుటుంబం సామూహిక ఆత్మహత్యలపై కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బొర్రా రామాంజనేయులు మాట్లాడుతూ వైసీపీ నేతల భూదాహం, రెవెన్యూ అధికారుల అక్రమాలపై ప్రత్యేక విచారణ చేపట్టాలన్నారు. సుబ్బారావుపై కడప పోలీసులు తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నారన్నారు. పాల సుబ్బారావు భూమికి కట్టాశ్రావణికి ఎలా రికార్డు మారిందో కలెక్టర్, ఆర్‌డిఓ సమాధానం చెప్పాల న్నారు. ఆ కుటుంబం ఆత్మహత్యలను పోలీసులు వక్రీకరిచండం సరికాదన్నారు. పోలీసులు కాకుండా రిటైర్డ్ జడ్జితో విచారణ జరపాలన్నారు. ఆ కుటుంబానికి 50 లక్షలు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సంటెన్న, పోసా ఆదినారాయణ, మల్లికార్జున, బత్తల శ్రీను, షైలగానీ శ్రీనివాసులు, తుపాకుల చౌడయ్య, జీసీ పుల్లయ్య పాల్గొన్నారు.

చేనేత కుటుంబం

సామూహిక ఆత్మహత్యలను వక్రీకరిస్తున్న ప్రభుత్వం

ప్రొద్దుటూరు, మార్చి 25 : ఒంటిమిట్ట మాదవరంలో వైసీపీ భూ దందాకు బలైన చేనేత కుటుంబం సామూహిక ఆత్మహత్యలపై ప్రభుత్వం, పోలీసులు వక్రీకరించడం అత్యంత హేయమైనదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగా శివకళ్యాణి తప్పుబట్టారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న పాల సుబ్బారావు వ్యసనాలకు బానిసై అప్పులెక్కువై భార్యపిల్లలను చంపి తాను ఆత్మహత్య చేసుకున్నాడని దుర్మార్గపు ప్రచారం చేస్తున్నారన్నారు. ఎక్కడ వైసీసీ భూదందాలు బయట పడతాయని రెవెన్యూ అధికారులు అవినీతి బాగోతం గుట్టురట్టవుతుందోనని నేరస్తులను ప్రభుత్వం కాపాడు తోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో చేనేత కులాలకు చెందిన కార్పొరేషన్ చైర్మెన్లు, డైరెక్టర్లు ఏమయ్యారని ప్రశ్నించారు. బీసీ కులాలను వంచించడానికి తప్ప ఆ కుల కార్పొరేషన్ పదవులు బీసీలకు నయా పైసా సాయం చేయలేదన్నారు. సమావేశంలో పట్టణ బీజేపీ ఉపాధ్యక్షుడు శివనాగిరెడ్డి, జిల్లాకార్యవర్గ సభ్యులు నరసింహాప్రకాష్, బీజేవైఎం నాయకుడు రాఘవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

బీసీలను బలిగొన్న వైసీపీ భూబకాసురులు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 25: వైసీపీ నాయకుల భూదాహంతోనే ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరంలో చేనేత కుటుంబానికి చెందిన ముగ్గురు కుటుంబ సభ్యులు ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలుగుదేశం పార్టీ బీసీసెల్ కార్యదర్శి నుంకర వేణుగోపాల్ విమర్శించారు. సోమవారం ఆత్మహత్యకు పాల్పడిన కుటుంబ సభ్యుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సుబ్బరాజు, గోమేదికం సుదర్శన్, మహేష్‌బాబు, మల్లికార్జున, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.